05ATP30_05ATP30.qxd 30-03-2026 PM 10:41 Page 1



## హనుమద్‌వాహనంపై ఊరేగిన శ్రీరంగనాథుడు

తాడిపత్రిఅర్బన్, మార్చి 30 ప్రభాతవార్త



హనుమద్‌వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి

మండలంలోని ఆలూరులో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామి హనమద్ వాహనంపై ఊరేగారు. ఉదయం అర్చకులు సుబ్బారావు, రంగనాథశర్మ, ఇంద్రకుమార్‌శర్మలు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, తదితర పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి హనుమద్‌వాహనంపై ఆలూరు గ్రామంలోని వీధుల్లో మేళతాళాలు బాణసంచా నడుమ అంగరంగవైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఓగేటి రంగ నాయకులు, ఆలయ ఇఒ రామాంజనేయులు, ఆలూరు గ్రామపెద్ద తిరుపాల్‌రెడ్డి, ఆలయ సిబ్బంది కాశీ, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## చాంద్ హాఫీజ్ నవాజ్‌కు సత్కారం

తాడిపత్రిటౌన్, మార్చి 30 ప్రభాతవార్త



చాంద్ హాఫీజ్ నవాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పట్టణానికి చెందిన చాంద్ హాఫీజ్ నవాజ్ విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండే సైన్స్ సెంటర్‌కు అవసరమైన వెబ్‌సైట్, యాప్‌ను ఉచితంగా రూపకల్పన చేశారు. అదేవిధంగా ఎన్నో కంపెనీలకు కూడా తను సేవలందిస్తున్నారు. ఇప్పటికే తాను ఎన్నో రివార్డ్స్ అందుకున్నారు. ప్రతిభ గల చాంద్ హాఫీజ్ నవాజ్‌ను ఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. చాంద్ హాఫీజ్ నవాజ్ సేవలు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని సేవా సంస్థ సభ్యులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్షుడు రామాంజనేయులు, కన్వీనర్ శ్రీహరి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారబోయిన శంకర్, ట్రెజరర్ శ్రీరంగయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాసులు, చంద్రశేఖర్, కార్యదర్శి లక్ష్మినారాయణ, సభ్యులు తిరుపాల్, మహమ్మద్‌రఫీ, హాఫీజ్ నవాజ్ తండ్రి షాషావలి, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు అన్నదానం

పుట్లూరు, మార్చి 30 ప్రభాతవార్త



భోజనం వడ్డిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని తహ శీల్దార్ కార్యాలయం సమీపం లోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయం వద్ద సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గత 128 సోమవారాలుగా దాతల సహకారంతో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయం అభివృద్ధి చేయడానికి గాను ప్రతి సోమవారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరుగుతోందని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దాతలు ఆర్.ఓబులేసు, భారతీయ జనతాపార్టీ అసెంబ్లీ ఎక్స్ కో కన్వీనర్ కుందూ శ్రీనివాసులరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు మజ్జిగ పంపిణీ

పుట్లూరు, మార్చి 30 ప్రభాతవార్త



విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేస్తున్న దృశ్యం

పుట్లూరు ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం కడవకల్లు గ్రామంలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఎం.వెంకటేష్ తన సొంత ఖర్చుతో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ప్రస్తుతం వేసవికాలాన్ని దృష్టిలో వుంచుకుని ఎండ వేడిమి నుండి ఉపశనం కలిగేందుకు విద్యార్థులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ-2 ప్రేమ్‌కుమార్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రత్యేక పుష్పాలంకరణలో బుగ్గరామలింగేశ్వరుడు

తాడిపత్రిటౌన్, మార్చి 30 ప్రభాతవార్త



తాడిపత్రి పట్టణ సమీపంలోని పెన్నానది తీరాన వెలసిన బుగ్గరామలింగేశ్వరస్వామి సోమవారం ప్రత్యేక పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి అర్చకులు ఎం.యోగానంద కుమార్‌శర్మ, రామకృష్ణశర్మలు పంచామృతాభిషేకాలు నిర్వహించి వెండిముఖ కవచంతో పాటు వివిధ రకాల పూల మాలలతో ప్రత్యేక ంగా అలంకరించారు. అదేవిధంగా శ్రీరాజరాజేశ్వరిదేవి అమ్మ వారిని అర్చకులు మహేష్‌శర్మ, రవిశర్మలు ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చనలు తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీసీతారామ లక్ష్మణ ఆంజనేయస్వామికి, నవగ్రహాలకు అర్చకులు శంకరయ్యశర్మ, గిరిశర్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చంద్రమోహన్‌నాయుడు, కమిటీ సభ్యులు చవ్వా రంగనాథరెడ్డి, సిబ్బంది విజయ్, తదితరులు పాల్గొన్నారు.

## అందరి సహకారంతో మార్కెట్ ఫీజు వసూళ్లు 92 శాతం సాధించగలిగాం

-మార్కెట్‌యార్డుచైర్‌పర్సన్ భూమా నాగరాగిణి

తాడిపత్రిటౌన్, మార్చి 30 ప్రభాతవార్త



భూమా నాగరాగిణి

తాడిపత్రి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌కు సంబంధించి 2025-2026 ఆర్థిక సంవత్సరానికి గాను మార్కెట్ ఫీజు అందరి సహకారంతో 92 శాతం వసూళ్ల సాధించగలిగామని మార్కెట్‌యార్డుచైర్‌పర్సన్ భూమా నాగరాగిణి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను కొత్తగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఇక్కడి పరిస్థితులను అర్థం చేసుకుని 92 శాతం అంటే దాదాపు 2.16 కోట్ల రూపాయల వసూళ్ల సాధించడం ఎంతో సంతోషంగా, గర్వంగా వుందన్నారు. ఇందుకు తోడ్పడిన ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్‌యార్డు సిబ్బందికి ఆమె హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహకారం వల్లనే ఈ లక్ష్యం సాధ్యమైందని, ఇలానే ముందుకు సాగుతూ రైతులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కట్టుబడి ఉన్నామని ఆమె పేర్కొన్నారు.

## చట్ట వ్యతిరేక చర్యలకు పోలీసుల ఆజ్యం

- తాడిపత్రి పోలీసులపై పెద్దారెడ్డి ఘాటు వ్యాఖ్యలు
- పార్టీ గెలుపే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలి
- బూత్‌లెవెల్ ఏజెంట్ల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి, మార్చి30, ప్రభాతవార్త



హాజరైన కార్యకర్తలు, నాయకులు

తాడిపత్రిలో సాగుతున్న చట్ట వ్యతిరేక చర్యలకు స్థానిక పోలీసులే సహకరిస్తున్నారని, జూదాలకు, గంజాయి విక్రయాలకు పోలీసుల పరోక్ష సహకారం ఉందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఘాటుగా వ్యాఖ్యానించారు. స్థానిక వైకాపా కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన తాడిపత్రి పట్టణ, రూరల్ ప్రాంతాలకు చెందిన బూత్‌లెవెల్ ఏజెంట్ల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడిపత్రిలో ఓ పోలీసు అధికారి మట్కా, పేకాటలను ప్రోత్సహించడమే గాక ఆకతాయిలా మహిళలను కూడా వేధిస్తున్నాడంటే పోలీసు వ్యవస్థ ఎంతలా దిగజారిపోయిందో ఇట్టే అర్థం చేసుకోవచ్చని ఆయన విమర్శించారు. ప్రతి రోజు రూ.30 వేలు నుంచి రూ.50 వేలు వరకు ఆటకు ఇంతని పేకాటరాయుళ్లతోనూ, మట్కా నిర్వహకులతో వారానికి ఇంతని పోలీసులు వసూళ్లకు పాల్పడుతున్నారని, ఇక ఇక్కడ గంజాయి విక్రయాలకు అడ్డు అదుపే లేదని ఆయన ఆరోపించారు. ఎవరి మీద అయినా దాడులు చేస్తే పోలీసులు కేసులు నమోదు చేసేది లేకపోవడంతో వారిపై నమ్మకాన్ని కోల్పోయిన బాధితులు ఫిర్యాదు చేయడమే వృథా అనే అభిప్రాయానికి వచ్చారని పెద్దారెడ్డి అన్నారు. ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడటంలో తప్పులేదని, వారితో కలసి కుట్రలు చేయడం సరికాదని, అలాంటి ఆ నలుగురితోనే ప్రమాదకరమని ఆయన చెప్పారు. ఎవరి ఉనికిని వారు కాపాడుకోవడం రాజకీయాల్లో సహజమని, కానీ ఆ నలుగురితోనే కార్యకర్తలు, నాయకులు జాగ్రత్తగా ఉండాలని ఆయన తెలిపారు. పట్టణంలో ఆక్రమణల తొలగింపు ఏకపక్షంగా జరుగుతోందని, ఈ ఆక్రమణల తొలగింపు వసూళ్లే లక్ష్యంగా సాగుతోందని ఆయన విమర్శించారు. మన సొమ్ము మనం తింటూ భయపడి బానిస బతుకులు బతికేకంటే వలసలు పోవడం నయమని, ఈ ప్రభుత్వంలో నష్టపోయిన కార్యకర్తలకు, నాయకులకు వైకాపా ప్రభుత్వం వచ్చిన తర్వాత తప్పనిసరిగా న్యాయం చేస్తామని పెద్దారెడ్డి చెప్పారు. వైకాపా నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులను వేధించిన ఏ ఒక్కరిని వదలిపెట్టమని, వారికి వడ్డీతో సహా తిరిగి చెల్లిస్తామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుత అధికార పార్టీ సామాజిక వర్గానికి చెందిన నాయకులు, కార్యకర్తలు తాడిపత్రికి వచ్చినప్పుడు జేసీ ప్రభాకర్ రెడ్డితో అమ్మనాబూతులు తిట్టించుకుంటూ బతుకీడుస్తున్నారని, బయటికి పోయిన తర్వాత 'అన్న నవ్వుకుంటూ తిట్టినాడులే..అయినా మనం పైన పార్టీని చూడాలి కాని అంటూ ఒకరినొకరు ఓదార్చుకుంటూ సర్దుకుపోతున్నారని పెద్దారెడ్డి ఎద్దేవా చేశారు. ఆ సామాజిక వర్గానికి చెందిన వారు ఎలాగూ బయటి పార్టీలకు ఓటేయరులే అనే ధీమాతోనే జేసీ అలా వారిని అవమానిస్తున్నా భరిస్తున్నారని కేతిరెడ్డి తెలిపారు. బూత్‌లెవెల్ స్థాయి నుంచి ఏజెంట్లు చురుగ్గా పనిచేయాలని, పార్టీ సానుభూతి పరుల ఓట్లు తొలగిపోకుండా అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. సమావేశం అనంతరం పట్టణ వైకాపా నాయకులు పేరం స్వర్ణలత, జిలాన్, అయూబ్, డీవీ కుమార్ తదితరులతో సమాలోచనలు చేశారు. ఈ కార్యక్రమానికి పట్టణ, రూరల్ కన్వీనర్లు రాబర్ట్, విజయకాంత్‌రెడ్డి, సీనియర్ నాయకులు ఆలూరు రామేశ్వరరెడ్డి, వెంకటరెడ్డిపల్లి పుల్లారెడ్డి, కంచం రామ్మోహన్‌రెడ్డి, ఆర్సీ ఓబుళరెడ్డి, సజ్జలదిన్నె రాజు, కాశీ మనోజ్ , రవితేజ, కేశవరెడ్డి, పేరం అమరనాథ్‌రెడ్డి, షరీఫాతో పాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## హెల్మెట్ ధరించండి - ప్రాణాలు కాపాడుకోండి

- తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎస్‌పి

తాడిపత్రిఅర్బన్, మార్చి 30 ప్రభాతవార్త

మోటార్‌సైకిల్‌పై ప్రయాణించేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని తాడిపత్రి ఏఎస్‌పి రోహిత్‌కుమార్‌చౌదరి పేర్కొన్నారు. తాడిపత్రి రూరల్ పోలీసుస్టేషన్‌లో సోమవారం జర్నలిస్టులకు హెల్మెట్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మోటార్‌సైకిల్‌పై వెళ్లేవారు హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాల్లో తమ ప్రాణాలు కాపాడుకునేందుకు ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. ఇటీవల కాలంలో తాడిపత్రి ప్రాంతంలో మోటార్‌సైకిల్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని హెల్మెట్లు లేకపోవడంతో చాలామంది మృత్యువాత పడుతున్నారన్నారు. హెల్మెట్ ధరిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు దాదాపు 40 శాతం వరకు ప్రాణాలు పోకుండా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. మోటార్‌సైకిల్‌పై వెళ్లేటప్పుడు త్రిబుల్ డ్రైవింగ్ చేయరాదన్నారు. త్రిబుల్ డ్రైవింగ్ వల్ల మోటార్‌సైకిల్ నియంత్రణ కోల్పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. మైనర్ పిల్లలకు వాహనాలు ఇస్తే తనిఖీల్లో పట్టుబడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. మైనర్లకు వాహనం ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. మద్యం సేవించి మోటార్‌సైకిళ్లు నడపరాదన్నారు. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతే వారి కుటుంబాలు బజారునపడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ప్రజలందరూ మోటార్‌సైకిల్‌పై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరిస్తే వారికి రక్షణతో పాటు వారి కుటుంబం సురక్షితంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ శివగంగాధర్‌రెడ్డి, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## అర్హులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు రుణాలు మంజూరు చేయాలి : పిఎం రామాంజనేయులు



మేనేజర్ రాజేష్‌ను సన్మా నిస్తున్న రామాంజ నేయులు ←

తాడిపత్రిఅర్బన్, మార్చి 30 ప్రభాతవార్త

అర్హులైన బిసి, ఎస్‌సి, ఎస్‌టిలకు రుణాలు మంజూరు చేయాలని ఏపి ఎంఆర్‌పిఎస్ అధ్యక్షులు పిఎం రామాంజనేయులు పేర్కొన్నారు. పట్టణం లోని బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ రాజేష్‌ను సోమ వారం మర్యాద పూర్వ కంగా కలిసి శాలువా కప్పి పూలమాలవేసి సన్మా నించారు. అనంతరం ఆయన మేనేజర్‌తో మాట్లాడుతూ అర్హులైన బడుగు బలహీన వర్గాలైన బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీలకు ముద్ర రుణాలు, శిశు తరుణ్ కిషోర్ పథకాల కింద రుణాలు మంజూరు చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పిఎంఈజీపి స్టాండప్ ఇండియా పథకాల ద్వారా అర్హులైన ప్రతి ఒక్కరికి రుణాలు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు నాగభూషణం, ప్రసాద్, జైవీర్, తదితరులు పాల్గొన్నారు.

## మరింత ఉత్సాహంతో పనిచేయండి

- ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె చేతుల మీదుగా ఉత్తమ కార్యకర్త చన్నకేశవులకు సన్మానం

ఓబుళదేవరచెరువు, మార్చి 30, ప్రభాతవార్త



కార్యకర్తను సన్మానిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పల్లె

సామాజిక మాధ్యమాల్లో తెలుగుదేశం పార్టీ చేస్తున్న కార్యక్రమాలను ఎప్పటి కప్పుడు తెలియచేస్తూ మై టీడీపి యాప్ నిర్వహణలో చురుకుగా ఉన్న కార్యకర్తలను మరింత ప్రోత్సహిస్తూ ఘనంగా సత్కరించి అభినందించాలని పార్టీ అధిష్టానం అదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా పుట్టపర్తిలో నిర్వహించిన 44వ పార్టీ అవిర్భావ దినోత్సవ వేడుకల్లో మండలంలోని కొండకమర్ల పంచాయితి శేషయ్యగారిపల్లికి చెందిన దండలగల చన్నకేశవులును ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డిలు శాలువ కప్పి, మెమంటో, ప్రశంసా పత్రం అందించి సత్కరించి అభినందనలు తెలియచేశారు. ఉత్తమ కార్యకర్త ప్రశంసా పత్రం అందుకున్న చన్నకేశవులను సోమవారం టిడిపి నాయకులు, కార్యకర్తలు, మిత్రులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియచేశారు.

## సజావుగా వారపు సంత గేటు బహిరంగ వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

ఓబుళదేవరచెరువు, మార్చి 30, ప్రభాతవార్త

మండల కేంద్రం, కొండకమర్లలో కూరగాయల సంత గేటు వసూళ్లకు సంబంధించి సోమవారం నిర్వహించిన బహిరంగ వేలం పాట సజావుగా జరిగింది. సర్పంచులు గోవిందు, శ్రావణి సమక్షంలో ఎంపీడిఓ శివరాంప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ ఎంపీడిఓ అంజినప్పల ఆధ్వర్యంలో ఆయా గ్రామ సచివాలయాల్లో వేలం నిర్వహించారు. ప్రతి బుధవారం మండల కేంద్రంలో నిర్వహించే కూరగాయలు, నిత్యావసర సరుకుల దుకాణాల నుంచి గేటు వసూళ్ల చేసేందుకు అత్యధికంగా హుస్సేన్ భాష రూ 401000 పాడి దకి ్కంచుకున్నాడు. కొండకమర్ల సచివాలయంలో నిర్వహించిన కొండకమర్ల వారపు సంత గేటు వసూళ్లను యల్లేశ్వర్ దక్కించుకున్నాడు. రూ 3.86 లక్షలకు అత్యధికంగా వేలం పాడి సొంతం చేసుకున్నారు. మండల కేంద్రంలో లోడింగ్, అన్‌లోడింగ్ వసూళ్లకు రూ 184000 వేలం పాడి హుస్సేన్ భాష దక్కించుకున్నాడు. డిపాజిట్ రుసం పోనూ మిగతా మొత్తం 24 గంటలలోగా చెల్లించాలన్నారు. చెల్లించకపోతే రెండవ హెచ్చుపాట దారునికి సంత నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామని అధికారులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఓలు శంకర్, మల్లికార్జున, వేల్ఫేర్ అసిస్టెంట్ హారీష్‌తో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పీ 4 ప్రాజెక్టులో మార్గదర్శకులు మండల వాసి జనార్దన రెడ్డి

ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,కలెక్టర్ శ్యాం ప్రసాద్, మాజీ మంత్రి డాక్టర్ పల్లె చేతుల మీదుగా అవార్డు అందుకున్న జనార్ధన్ రెడ్డి

ఓబుళదేవరచెరువు, మార్చి 30, ప్రభాతవార్త

ఓడి చెరువు మండలం తోటి దిగువపల్లి ప్రాథమిక పాఠశాలకు 25 వేల రూపాయలు విలువచేసే త్రాగునీటి శుద్ధి కేంద్రాన్ని అందించినందుకు ప్రభుత్వం పి 4 ప్రాజెక్టులో మార్గదర్శకులుగా నిలిచిన కొక్కంటి పల్లి కి చెందిన జనార్దన్ రెడ్డిని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా మీదుగా సత్కరించి శాలువాతో సన్మానించి ప్రశంస పత్రాన్ని అందజేశారు. పుట్టపర్తి సాయి ఆరామంలో సోమవారం నిర్వహించిన పి 4 ప్రాజెక్టు ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా కార్యక్రమాలు అందించిన మార్గదర్శకులను ప్రభుత్వం ద్వారా జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా ఓడిసి మండలానికి చెందిన కొక్కంటి పల్లి గ్రామానికి చెందిన జనార్దన్ రెడ్డి తన వంతు సహాయంగా ప్రభుత్వ పాఠశాలకు రూ 25 వేలు విలువచేసే వాటర్ ప్లాంట్ ను విద్యార్థుల సంక్షేమం కోసం అందజేసినందుకు జిల్లా కలెక్టర్ తో పాటు ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథరెడ్డిలో ప్రత్యేకంగా అభినందించారు. ఇలా ప్రతి ఒక్కరు తన వంతు సేవలు పేదలకు అందించాలని వారు పిలుపునిచ్చారు.

## ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లండి

- పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ సమావేశంలో బిజెపి నాయకులు

ఓబుళదేవరచెరువు, మార్చి 30, ప్రభాతవార్త

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బిజెపి రాష్ట్ర నాయకులు తలుపుల గంగాధర్, సుదర్శన్‌లు కార్యకర్తలకు సూచించారు. బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు వీరాంజినేయులు ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐటిఐ కళాశాలలో సోమవారం పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహాభియాన్ సమావేశంలో వారు మాట్లాడుతూ....యన్డీయే కూటమిలో దేశం ప్రజలు సుభిక్షంగా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రజా సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోది ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించాలన్నారు. గ్రామస్థాయి నుండి బిజెపి బలోపేతం కోసం ప్రతి ఒక ్కరూ కష్టపడి పనిచేయాలన్నారు. సామాజిక మాధ్యామాల ద్వారా దేశసుస్థిరతకు ప్రధాని నరేంద్ర మోది చేస్తున్న కృషిని తెలియచేయాలని సూచించారు. ఓం నమో యాప్, సరల్ యాప్ వంటి వేదికల ద్వారా ప్రతి ఒక్క కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేయచ్చునని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అమరేందర్, ఓబిసి మోర్చా రాష్ట్ర కార్యదర్శి హంసాపురం చంటి, సీనియర్ నాయకులు రంగారెడ్డి, వెంకటశివ, చంద్ర, నరేష్, నాగప్ప, కొత్తచెరువు మండల కన్వీనర్ గంగయ్యానాయుడు, పుట్టపర్తి అసెంబ్లీ కోకన్వీనర్ సుదర్శన్ నాయుడు, బుక్కపట్నం మండల ప్రధాన కార్యదర్శి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## జన సందోహంలో వేమన ఉత్సవాలు

గాండ్లపెంట మార్చి 30 ప్రభాతవార్త



మండలంలోని కఠారుపల్లి పంచాయతీలో ప్రజాకవి తత్వవేత్త తాత్వికుడు అయినటువంటి వేమన ఉత్సవాలు జన సందోహం మధ్య అట్టహాసంగా సోమవారం రాత్రి బండ్ల తిరుణాల జరిగింది ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల ప్రజలు మరియు ఇతర జిల్లాల నుంచి భారీగా జనాలు రావడంతో వేమన ఉత్సవాలు ఎంతో ఘనంగా జరగడం జరిగింది అంతేకాకుండా ఆర్కెస్ట్రా మరియు చాందిని బండ్లు ఊరేగించడంతో పురవీధులన్నీ జన సందోహంతో నిండిపోయాయి అయితే వేమన ఉత్సవాలను సంవత్సర సంవత్సరానికి వేమన పీఠాధిపతి అయినటువంటి తుంగ నంద వేమారెడ్డి ఎంతో ఘనంగా నిర్వహించడంతోపాటు వచ్చినటువంటి భక్తులకు అన్నదానము మరియు వసతులను కల్పించడంతోపాటు ఎటువంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించడం చాలా సంతోషకరం అని గ్రామస్తులు కోరుకుంటున్నారు అయితే సోమవారం జరిగినటువంటి కార్యక్రమాలు ప్రజలను ఎంతగానో ఆకట్టుకున్నాయి ఇదే విధంగా ప్రతి సంవత్సరము జరగాలని ప్రజలు కోరుకుంటున్నారు భాగంగా మంగళవారం పుట్ల తిరుణాల నిర్వహిస్తారు ఈ కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు పీఠాధిపతి నంద వేమారెడ్డి పేర్కొన్నారు అదేవిధంగా గ్రామస్తులు ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని సహకరించాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమం నిర్వహణలో ఎటువంటి లోపం రాకుండా అంతా వేమన స్వామి చూసుకుంటారని పేర్కొన్నారు.

## హిందూదేవాలయ భూములకు రక్షణ కల్పించాలి

కలెక్టరుకు బిజెపి నాయకుల వినతి

ముదిగుబ్బ మార్చి 30 ప్రభాతవార్త



కలెక్టరుకు వినతిపత్రం అందిస్తున్న బిజెపి నాయకులు

రాష్ట్రంలో హిందూ దేవాలయాలకు చెందిన భూములను రక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ ముదిగుబ్బ బిజెపి నాయకులు సోమరి ప్రకాష్ సోమవారం సత్యసాయి జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు సోమల్ ప్రకాష్ మాట్లాడుతూ రాష్ట్రంలో దేవాల యాల వద్ద సుమారు 4.7 లక్షల ఎకరాల భూములు ఉన్నాయని అందులో దాదాపు 1.5 లక్షల ఎకరాలు ఆక్రమణకు గురయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేవాలయాలకు చెందిన విలువ వైనా భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన ఆరోపించారు కేవలం కొద్ది ఎకరాల భూమిని ఇచ్చే పేరుతో లక్షలకోట్ల రూపాయలు విలువైన ఆస్తులు మళ్లింపుకు గురవు తున్నాయని పేర్కొన్నారు. దేవాలయాల ఆధీనంలో ఉన్న భూములను క్రమ బద్ధీకరించి వాటిని ఆలయాల అభివృద్ధికి ఉపయోగించేలా చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. ప్రస్తుతం ఉన్న భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలనే ప్రభుత్వ నిర్ణయం అత్యంత ఆందోళనకరమని ఇది హిందూ సమాజానికి పెద్ద ముప్పుగా మారే అవకాశం ఉందని తెలిపారు. జీవో నెంబర్ 13 ద్వారా 33 సంవత్సరాల దీర్ఘకాలిక లీజు పేరుతో అర్బన్ ప్రాంతాల్లోని దేవాలయ భూములను ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాలనే విధానాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే హిందూ సమాజం కోర్టులను ఆశ్రయించే పరిస్థితి దాపురిస్తుందన్నారు. దేవాలయ భూములు ఇతరుల చేతుల్లోకి వెళ్లడం అసలుఅంగీకార యోగ్యం కాదని ఆ భూములు దేవాలయాలకే చెందాలని భారతీయ జనతా పార్టీ స్పష్టం చేసింది ఈ అంశంపై ప్రస్తుతం ప్రభుత్వం సమగ్రంగా పునర్విచారణ చేసి హిందూ ఆలయాల ఆస్తులను సంరక్షించే దిశగా చర్యలు తీసుకోవాలని వారు కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు

## యోగి వేమన బ్రహ్మోత్సవాలు కుమ్మగూడు



యోగి వేమన కుమ్మ గూడు కార్యక్రమం

నల్లచెరువు మార్చి 30. ప్రభాతవార్త

నల్లచెరువు మండల కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ యోగి వేమన దేవస్థానం నందు ఆదివారం మొదలు వారం రోజులపాటు కుమ్మగూడు కార్యక్రమంలో ప్రారంభమై శ్రీ యోగి వేమన ఉత్సవాలు ఆలయ అర్చకులు నిర్వహించారు ఈ సందర్భంగా సోమవారం వేకువజామనే శ్రీ యోగివేమన కుంభం కార్యక్రమాన్ని నిర్వహించారు గ్రామ పెద్దలు ఆనవాయితీ ప్రకారం కుంభం కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు సీతమ్మ జొన్నలతో ఉడకబెట్టి న సీతమ్మ జొన్నలను. యోగి వేమన స్వామి ఎదుట కుంభం రాశి పోసి స్వామివారికి నైవేద్యంగా పెట్టారు గంధం కుంకుమ సుగంధ ద్రవ్యాలతో వస్త్రాలతో ప్రత్యేక పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు వివిధ ప్రాంతాల నుండి భక్తులు కుంభం కార్యక్రమమునకు తరలివచ్చి కుంభాభిషేకాన్ని దర్శనం చేసుకున్నారు యోగివేమన చెప్పింది వాక్యంతో కుంభం ప్రతి గ్రామంలో ప్రతి ఇంట చల్లుకుంటే గోడ్డు గోదా పిల్లాపాపలతో ఆరోగ్యాలతో పాడి పశువులు పంటలు బాగా పండుతాయి అని భక్తులు కుంభాన్ని సేవించితే ఏ మనో రోగాలు ఉండవని అర్చకులు తెలియజేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు హరికథ కాలక్షేపం చెక్కభజనలు వివిధ కార్యక్రమాలు ప్రతి రోజు శ్రీ యోగి వేమన ఉత్సవ విగ్రహం ప్రాకారోత్సవం నిర్వహించబడతాయని అర్చకులు తెలిపారు ఈ కార్యక్రమంలో కర్ణం స్వామి, ప్రహల్లాద రెడ్డి, ప్రకాష్ రెడ్డి, దశరథ రామయ్య నాయుడు రామ్మోహన్ రెడ్డి, అంజినప్ప, ఉత్తన్న, ఆల అర్చకులు దేవళం వేణు, చెన్నకేశవులు,నాగార్జున. వేమయ్య, పాల్గొన్నారు.

## మాజి సర్పంచ్ శివారెడ్డిని పరామర్శించిన బియస్. మక్బుల్

నంబులపూలకుంట, మార్చి 30 ప్రభాతవార్త



మాజీ సర్పంచు శివారెడ్డిని పరామర్శిస్తున్న మక్బుల్

నంబులపూలకుంట మండలం ధనియానిచెరువు మాజీ సర్పంచ్ శివారెడ్డి కిడ్నీలా చికిత్స అనంతరం వారి స్వగృహం గోవిందా రాజుల పల్లిలో వున్నా శివారెడ్డిని సమన్వయ కర్త బియస్.మక్బుల్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రంగా రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైస్సార్సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## విబిజీ-రామ్-జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి

-సిపిఐ మండల కార్యదర్శి వి.వెంకటరాముడుయాదవ్

పెద్దవడుగూరు, మార్చి 30 ప్రభాతవార్త



తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న సిపిఐ నాయకులు

విబిజీ-రామ్-జి చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ సోమవారం సిపిఐ సీనియర్ నాయకులు వై.సూర్యనారాయణరెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి వి.వెంకటరాముడు యాదవ్ ఆధ్వర్యంలో పెద్దవడుగూరు మండల కేంద్రంలోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ కష్టజీవుల జీవనానికి ఎంతో ఉపయోగపడే మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చాలన్న ఉద్దేశ్యంతో మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం వేసే విధంగా ఈ పథకాన్ని రూపొందించడం జరిగిందన్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తే ఈ కొత్త పథకంలో 60 శాతం మాత్రమే ఇవ్వడం జరుగుతుందని, ఇప్పటికే అప్పుల ఊబిలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 40 శాతం నిధులు వెచ్చించాలని ఈ చట్టం రూపకల్పన చేయడమైందని దీనివల్ల ఉపాధి పథకం పేదలకు కేంద్ర విధానాల వల్ల భారీ నష్టం కలుగుతుందన్నారు. గతంలో కూలీలకు గడార్లు, గంపలు, పారలు, తార్పాలిన్లు మెడికల్ కిట్లు, అందించేవారని మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అవన్నీ అటకెక్కాయన్నారు. పథకాన్ని యదావిధంగా కొనసాగించాలని 200 రోజులు పని దినాలను పెంచాలని, కూలి 700 రూపాయలు ఇవ్వాలని, పని ప్రదేశాల్లో చనిపోయిన వ్యక్తి కుటుంబానికి 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని రైతుల పంటలకు గిట్టుబాటు లేక తీవ్ర నష్టాలు అప్పుల పాలవుతున్నారని తక్షణమే రైతులకు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు నారాయణ, సిపిఐ నాయకులు రంగస్వామి, రంగనాయకులు, అల్లాబకాష్, హుస్సేన్ పీరా, ఓం నారాయణ, కిరణ్, నాగేంద్ర, డి.రామాంజనేయులు, చారుగుండ్ల వెంకట రాముడు,ఆదిరంగారెడ్డి,పరమేశు,సుంకన్న,రంగడు, సంజన, పాల్గొన్నారు.

## ప్రత్యేకంగా పట్టాభిరామునికి పూజలు

- భక్తులకు పానకం, గుగ్గిళ్లు పంపిణీ చేసిన యువత



సీతారామునికి పూజలు నిర్వహిస్తున్న యువ భక్తులు

అగళి, మార్చి 30 ప్రభాతవార్త

మండల కేంద్రమైన అగళిలో యువకులు ఉత్సాహంగా ప్రత్యేక పట్టాభి సీతారాముని పూజలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పూలతో చూడముచ్చటగా అలంకరించారు. ప్రత్యేకంగా పురోహితులతో పూజలు చేయించారు. అనంతరం భక్తులకు యువ భక్తులు పానకం, గుగ్గిళ్లను పంపిణీ చేశారు. రాముని పరిపాలన గురించి తండ్రిపైన అతని మమకారంపైన వక్తలు వివరించారు.

## ధర్మవరంలో ఏప్రిల్ 1న మంత్రిసత్యకుమార్ యాదవ్ పర్యటన..!

ధర్మవరం,మార్చి30,ప్రభాతవార్త



సత్య కుమార్ యాదవ్ (ఫైల్‌ఫోటో)

రాష్ట్రవైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఏప్రిల్ 1న ధర్మవరంలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి హరీశ్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా పుట్టపర్తిలోని కలెక్టరేట్, పీజీఆర్ఎస్ హాల్లో ఏర్పాటుచేసిన జిల్లాసమీక్ష కమిటి సమావేశంలో పాల్గొంటారన్నారు. అనంతరం మద్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గం టల వరకు ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## ఓణీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



ఓణీ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దృశ్యం

రొళ్ల మార్చి30(ప్రభాతవార్త):

మండలంలోని మల్లీన మడుగు సమీపంలో గల కాల్వేపల్లిలో ఆదివారం జరిగిన ఓణీ వేడుకలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న ,వైసిపి నేత శివప్రసాద్ ,స్థానిక ఎస్సై గౌతమి ముఖ్య అతిథులుగా పాల్గొ ని బాలికను ఆశీర్వదించారు.కాల్వే పల్లీ గ్రామానికి చెందిన హోటల్ నరసింహప్పా,రంగమ్మ దంపతులు కుమార్తె ఓణీ వేడుక నిర్వహించారు. నరసింహప్పా ఆహ్వానం మేరకు వారు పాల్గొని అక్షింతలేసి బాలికను ఆశీర్వదించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బాలికలు విద్యలోనూ, అన్ని రంగాలలోనూ ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులు ఆమెకు మంచి విద్య, మంచి సంస్కారం అందించాలని సూచించారు. సమాజంలో మహిళలకు గౌరవం, స్థానం పెరుగుతున్న ఈ సమయంలో బాలికల భవిష్యత్తు కోసం అందరూ కలిసి కృషి చేయాలని సూచించారు.

## ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరాలి

- బత్తలపల్లి సమావేశంలో హరీష్ బాబు పిలుపు
- బూత్ స్థాయిలో కార్యకలాపాలపై నాయకులకు దిశానిర్దేశం

బత్తలపల్లి, మార్చి 30 ప్రభాతవార్త

రాష్ట్ర భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మన ఊరు – మన జెండా కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా బత్తలపల్లి మండల కేంద్రంలోని ఆర్కే ఫంక్షన్ హాల్‌లో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు అధ్యక్షత వహించి, పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ, ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న మన ఊరు – మన జెండా కార్యక్రమం పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగినదని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామానికి, ప్రతి బూత్ స్థాయికి పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాల వారీగా కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించాలని, ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పార్టీ జెండాను ప్రతి గ్రామంలో గర్వంగా ఎగురవేసే విధంగా కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని పిలుపునిచ్చారు. అలాగే, ఈ కార్యక్రమం కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, పార్టీ బలోపేతానికి, ప్రజలతో మమేకం అయ్యే ఒక ఉద్యమంగా తీసుకోవాలని నాయకులకు సూచించారు. ప్రతి కార్యకర్త బాధ్యతతో పనిచేస్తే నియోజకవర్గంలో పార్టీ మరింత బలపడుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మండల, గ్రామ స్థాయి నాయకులు, బూత్ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. రాబోయే రోజుల్లో కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి సాకే ఓబులేష్, బిజెపి మండల అధ్యక్షులు భాస్కర్, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి కోటి సుధా, ఆకులేటి వీరనారప్ప, కావేటి మల్లికార్జున, సురేంద్ర నాయుడు, వెంకటేశ్వర్ రెడ్డి, వెంకటేశ్వర్లు చౌదరి, పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వలసలో మారమ్మ దేవికి జలది ఉత్సవాలు

అమరాపురం మార్చి 30 ప్రభాతవార్త



విశేష పూజలు దృశ్యం

మండల పరిధిలోని వలస గ్రామంలో మూడు రోజులపాటు వలస మారమ్మ దేవి జాతరను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం మారమ్మ దేవికి పూరి పొలిమేరలో జలది ఉత్సవం, గంగ ,యమున, సరస్వతి, ఉదయం 7 నుంచి 8 గంటల మధ్యలో జల్దీ మహోత్సవ పూజ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వలస చింత తోపులో నీరు గంటి సన్నమారప్ప మరియు వారి కుమారులకు పట్ట అభిషేకం చేయడం, వారి కుమారుల చేత ప్రసాద వినియోగం తదితర వాటిని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మారన్న రాఘవేంద్ర వారు తెలియజేశారు. మారమ్మ దేవిని ఉదయం నుండే రాత్రి 8 గంటల వరకు మేళా తాళాలతో డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా చింతతోపు నుండి దేవాలయం వరకు ఊరేగింపు తీసుకువచ్చి రాత్రికి దేవాలయంలో కూర్చోబెట్టారు ఈ సందర్భంగా భక్తులు అత్యధికంగా పాల్గొని ఈ జలది మహోత్సవాన్ని భక్తాదులు అధిక సంఖ్యలో పాల్గొని మారమ్మ దేవికి బత్తాదులు కోలహాలంగా పాల్గొన్నారు, దేవాలయపు యజమానులు, తిప్పేస్వామి, విశ్వేశ్వర, దాసప్ప, బసవరాజు, తమన్న వెంకట చలపతి శాంతరామప్ప హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాడికీ ఎన్టీఆర్ సొంత ఇల్లు- ఎమ్మెల్యే,మాజీ ఎమ్మెల్సీ



ఎన్టీఆర్ గృహాన్ని రిబ్బన్ కట్ చేసిన ఎమ్మెల్యే రాజు.మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి

మడకశిర టౌన్ మార్చి 30 ప్రభాతవార్త

ప్రతి పేదవాడికి కూటమి ప్రభుత్వం ఇల్లు ఇస్తుందని జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని 16వ వార్డు హోంగార్డ్ కాలనీలో హోంగార్డ్ బాలు రాజు నిర్మించుకున్న ఎన్టీఆర్ గృహాన్ని ఎమ్మెల్యే రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి చేతుల మీదుగా గృహప్రవేశ రిబ్బన్ కట్ చేసి ప్రారంభిచారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు, టిటిడి బోర్డు మెంబర్, ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి లు మాట్లాడుతూ: బియమ్ ఏ వై, బి ఎల్ సి,అర్బన్ స్కీమ్ ద్వారా లబ్ధిదారుడు బాలరాజుకు లక్షల 2, 50 వేల రూపాయలతో ఎన్టీఆర్ గృహాన్ని నిర్మించుకోవడం జరిగిందన్నారు.పేదల సొంత ఇంటి కళ నెరవేర్చడమే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని, ఆ దిశగా ఆయన ముందుకు వెళ్తున్నారని తెలిపారు. గత వైసీపీ పాలనలో పేదల ఇంటి కలను నిర్వీర్యం చేశారని అన్నారు. ఎన్టీఆర్ గృహాలకు లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకుంటే నాటి వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించక ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల నోట్లో మట్టి కొట్టారని వారు అని అన్నారు. పేదలను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతూ మరోవైపు అభివృద్ధిలో ముందుకు దూసుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ శ్రీకర్.హౌసింగ్ ఏడి శివకుమార్. ఏఈ నాగభూషణ్. మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్. మున్సిపల్ ఏఈ మురళి. పట్టణ అధ్యక్షుడు నాగరాజు. మండల కన్వీనర్ నాగరాజు.సుబ్బారెడ్డి. గృహ నిర్మాణ శాఖ సిబ్బంది ఏఈలు. వర్క్ ఇన్స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పునరావతం కానివ్వద్దు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి, మార్చి 30, ప్రభాతవార్త



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్ కుమార్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పి జి ఆర్ ఎస్)లో వచ్చే ఫిర్యాదులు పునరావతం కాకుండా, సత్వరమే న్యాయం జరిగే విధంగా చూడాలని పోలీస్ అధికారులకు జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆదేశించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో సోమవారం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో పి జి ఆర్ ఎస్ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 62 అర్జీలను స్వీకరించారు. ఎస్పీ అర్జీదారులతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, అత్తారింటి వేధింపులు, భూఆస్తి వివాదాలు, నకిలీ పత్రాలు, , ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి సమస్యలను విని సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి బాధితులకు సత్వర న్యాయం జరిగే విధంగా చూడాలని ఆదేశించారు. బాధితుల యొక్క సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు, అడిషనల్ ఎస్పీ అంకిత సురాన, డిటిఆర్బి సిఐ లక్ష్మీ కాంత్ రెడ్డి, ఎయిర్పోర్ట్ సీఐ బొజ్జప్ప సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ రామలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు

వజ్రకరూరు మార్చి 30 ప్రభాతవార్త



హుండి ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

మండలంలోని ప్రసిద్ధమైన శైవ క్షేత్రం శ్రీ జరుట్ల రామలింగేశ్వరుని హుండీ ఆదాయం లెక్కింపు ను సోమవారం తాడిపత్రి ఆలయ కార్యనిర్వాహణాధికారి యమ్ వి సుబ్రహ్మణ్యం అధ్వర్యంలో గ్రామ పెద్దల సమక్షంలో చేపట్టరు. 27.03.2025నుండి 30.03.2026వరకు భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా 5,03,510 ఆదాయం వచ్చినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో వజ్రకరూరు ఆలయ కార్య నిర్వహణ అధికారి అంగలదాల క్రిష్ణయ్య, సర్పంచ్ తిరుపాల్ , రికార్డ్ అసిస్టెంట్ లాలేష్ అర్చకులు నాగరాజు స్వామి , రాజేంద్ర స్వామి, మంజు స్వామి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

-బూదగవివద్ద జాతీయ రహదారిలో ప్రమాదం

-ద్విచక్రవాహన చోదకులు ఇద్దరికీ స్వల్ప గాయాలు

ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త



తీవ్రంగా గాయపడి మృతి చెందిన వృద్ధుడు బెస్త వెంకటేశులు





గాయపడిన దిలీప్, చరణ్‌కుమార్‌రెడ్డి

అనంతపురం–బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో మండల పరిధిలోని బూదగవి గ్రామం మారెమ్మ గుడివద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గార్లదిన్నెకు చెందిన బెస్త వెంకటేశులు (65) మృతి చెందాడు. ప్రమాదంలో ఇద్దరు యువకులకు గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన దిలీప్, చరణ్‌కుమార్‌రెడ్డి తమ కుక్కకు ఇంజక్షన్ వేయించుకొని ద్విచక్రవాహనంలో తిరిగి గ్రామానికి వెళుతూ బూదగవి గ్రామంవద్ద రోడ్డు దాటుతున్న వృద్ధుడు బెస్త వెంకటేశులును వాహనంతో బలంగా ఢీకొన్నారు. దీంతో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ క్రమంలోనే ద్విచక్రవాహనంపై ఉన్న కుక్క అమాంతం ఎగిరి క్రింద పడగా ద్విచక్రవాహనం కూడా అదుపుతప్పి అందులో ప్రయాణిస్తున్న దిలీప్, చరణ్‌కుమార్‌రెడ్డికు గాయాలయ్యాయి. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించడంతో అంబులెన్స్ అక్కడికి చేరుకొని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం తీవ్ర గాయాలైన వృద్ధుడు బెస్త వెంకటేశులును వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్సకై జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య లక్ష్మిదేవి, నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాయి. బూదగవి గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా జరిగిన రథోత్సవ కార్యక్రమానికి కుమార్తె అరుణ ఇంటికి వచ్చిన బెస్త వెంకటేశులు రోడ్డు ప్రమాదంలో మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## అణగారిన వర్గాలకు సాయంచేసి అభివృద్ధి పర్చడమే ప్రభుత్వ లక్ష్యం

-పీ4 పథకం వార్షికోత్సవంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి అఖిల

-ముగ్గురు సమాజ సేవలను సన్మానించి సన్మాన పత్రాలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న నియోజకవర్గ ప్రత్యేక అధికారి అఖిల

ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త

అణగారిన వర్గాలకు సాయంచేసి వారి జీవితాలను అభివృద్ధి దిశగా తీసుకెళ్లడానికి పీ4 పథకం ఎంతో ఉపయోగపడుతుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి అఖిల అన్నారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన పీ4 పథకం మొదటి వార్షికోత్సవం నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని



కార్యక్రమానికి హాజరైన ప్రజలు

మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో సోమవారం అట్టహాసంగా జరిగింది. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నియోజకవర్గ ప్రత్యేక అధికారి అఖిల మాట్లాడుతూ సమాజం నుంచి లబ్ధిపొంది ఉన్నత స్థానాలకు ఎదిగిన వారు తిరిగి సమాజానికి సేవ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. పీ4 పథకం ద్వారా సమాజంలో సమానత్వం, సహకారం పెంపొందుతాయని ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత తీసుకుంటేనే అభివృద్ధి, పేదరిక నిర్మూలన సాధ్యమవుతున్నారు. ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 1,231 బంగారు కుటుంబాలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందాయని, 241 మంది మార్గదర్శకులు ముందుకు వచ్చి పేద కుటుంబాలకు మార్గనిర్దేశం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. సుజలాన్ ఎనర్జీ లిమిటెడ్ సంస్థ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో ఫండ్–ఏ–నీడ్ కార్యక్రమం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించారని తెలిపారు. మొత్తం 12 కుటుంబాలకు ఒక్కొక్కరికి 40,000 చొప్పున సహాయం అందించగా లబ్ధి పొందిన కుటుంబాలు ప్రస్తుతం ఆర్థికంగా కొంత మెరుగైన స్థితికి చేరుకున్నాయన్నారు. ఈ సందర్భంగా సమాజ శ్రేయస్సుకై పాటు పడుతున్న నిస్వార్థ సంస్థ వ్యవస్థాపకులు తాటికొండ వెంకట్, జై కిసాన్ ఫౌండేషన్ ఛైర్మెన్ నాగమల్లి ఓబులేష్, సుజలాన్ ఎనర్జీ లిమిటెడ్ ప్రతినిధిను ఘనంగా సన్మానించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డు ఛైర్మెన్ నరిశేటి విజయభాస్కర్, ఉరవకొండ పీఏసీఎస్ ఛైర్మెన్ ప్యారం కేశవానంద, ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, తహశీల్దార్ పాటిల్ భోగనగౌడ్, బెలుగుప్ప తహశీల్దార్ బి.అనీల్‌కుమార్, ఐసీడీఎస్ సీడీపీవో డా॥బి.ఎన్.శ్రీదేవి, ఏడీఏ ఎస్.సత్యనారాయణ, ఎంఈవో హెచ్.ఈశ్వరప్ప, విడపనకల్లు మండల పరిషత్ ఏవో ఎం.భాస్కర్‌బాబు, టీడీపీ నాయకులు మోపిడి గోవిందు, యేళ్ల తిమ్మప్ప, యర్రగుంట్ల వెంకటేష్, నెట్టం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## ఏపి రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులుగా డాక్టర్ శ్రీనివాసమూర్తి బాధ్యతల స్వీకరణ



బాలల హక్కుల పరిరక్షణ సభ్యులుగా భాధ్యతలు తీసుకొంటున్న డాక్టర్ శ్రీనివాసమూర్తి

మడకశిర మార్చి 30 ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ నూతన చైర్ పర్సన్‌గా వేటుకూరి ఏవిఎస్ సూర్యనారా యణ రాజు తో పాటు సభ్యులుగా కే.జీ వెంకట పద్మలత, డాక్టర్ ధోని శ్రీనివాస్ మూర్తి, ఉండవల్లి గాంధీ బాబు, చల్ల మధుసూదన రావు, మండల గంగ సూర్యనారాయణ, పి.నాగ మానస సోమవారం రాష్ట్ర కార్యాలయంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సెక్రటరీ ఉమాదేవి సమక్షంలో నూతన చైర్ పర్సన్, సభ్యులు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సెక్రటరీ, సిబ్బంది నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస మూర్తి మాట్లాడుతూ బాలల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసేలా పనిచేస్తామని తెలిపారు. సభ్యులు సమన్వయంతో బాలల హక్కుల పరిరక్షణలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామన్నారు. రాష్ట్రస్థాయి, జిల్లాస్థాయి అధికారుల సమన్వయంతో చైల్డ్ ఫ్రెండ్లీ స్టేట్‌గా ఆంధ్రప్రదేశ్‌ని నిలుపుతామన్నారు. బాలల హక్కులకు భంగం వాటిల్లితే తక్షణమే కమిషన్ దృష్టికి తీసుకు రావాలని ప్రజలను కోరారు.

## పొలాలకు వెళ్లే దారిలో నిర్మించిన అక్రమ నిర్మాణాలు తొలగించాలి



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు, మార్చి 30 ప్రభాతవార్త

పట్టణ శివారంలోని ధోనిముక్కల ప్రాంతం టిడ్కో ఇళ్ల వెనుక బంగారు పొలాలకు వెళ్లే దారిలో చేపట్టిన అక్రమ నిర్మాణాలను తొలగించాలని బీజేపీ నాయకులు వడ్డే రమేష్ సోమవారం రైతులతో కలిసి అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ భూషణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత గుంతకల్లుకు చెందిన రైతుల పొలాల (సర్వే నెంబర్ 539,559)కు వెళ్లడానికి వీలు లేకుండా కొంతమంది దారిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారన్నారు. గత 50 ఏళ్లుగా రైతులు అదే దారిలో వెళుతున్నారన్నారు. దారిని ఆక్రమించడంతో పొలాలకు వెళ్లడానికి ఇబ్బందిగా మారిందన్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని వారు కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు శ్రీరాములు, శ్రీనివాసులు, ఆదినారాయణ, శివయ్య, లింగన్న, రాము, తదితరులు ఉన్నారు.

## సోదరభావం సమానత్వానికి ప్రతీక

గుత్తి, మార్చి 30 ప్రభాతవార్త



నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

సమాజంలో ప్రతి ఒక్కరూ కులమతాలకు అతీతంగా సోదరభావంతో మెలగాలని జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర కార్యదర్శి యాసిర్ అహ్మద్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఈద్ మిలాప్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసాయి కళాశాల ప్రిన్సిపాల్ జయరంగారెడ్డి, జోసెఫ్ తదితరులు మాట్లాడుతూ సామాజిక ఐక్యత మతసామరస్యాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిలాన్, స్థానిక అధ్యక్షుడు ఫజలుల్లా, తదితరులు పాల్గొన్నారు.

## దళితులకు ఇంటి స్థలాలు, పక్కా గృహాలు ఇవ్వాలని ధర్నా



ఎంఆర్‌పిఎస్ కార్యకర్తలు ధర్నా చేస్తున్న దృశ్యం

గుత్తి, మార్చి 30 ప్రభాతవార్త

గుత్తి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న దళితులకు ఇంటి నివేశన స్థలాలు కేటాయిస్తూ పక్కా గృహాలు మంజూరు చేయాలని సోమవారం ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజనప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నెంబర్ 547, 565లలో ఉన్న ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిలో మాదిగలకు స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రస్తుతం ఉన్న పట్టాలకు పొజిషన్ సర్టిఫికెట్ అవసరం లేకుండా ఇంటి గృహాలు మంజూరు చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ పుణ్యవతికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఇన్‌చార్జ్ అడవి రాముడు, రామాంజి, శివరాం, జయరాముడు, ఎల్లమ్మ, వెంకటేష్, అంజి, రమణ, రంగస్వామి, ఈరన్న, పాల్గొన్నారు.

## పది సాంఘిక శాస్త్రం పరీక్ష కి 213 మంది విద్యార్థులు గైర్హాజరు..

కొత్తచెరువు మార్చి 28 ప్రభాతవార్త

పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా సోమవారం నిర్వహించిన సోషల్ స్టడీస్ పరీక్షకి 213 మంది విద్యార్థులు గైరహాజరయ్యార ని డీఈవో జి కృష్ణప్ప తెలిపారు ఈ మేరకు జిల్లాలో 107 పరీక్ష కేంద్రాల్లో 21 441 మంది విద్యార్థులు సాంఘిక శాస్త్రం పరీక్ష రాయవలసి ఉండగా వారిలో21228 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు213 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. హాజరు నమోదు 98.01 శాతం నమోదు కావడం జరిగింది అలాగే ఓపెన్ టెన్త్ పరీక్ష కి 408 మంది విద్యార్థులు పరీక్ష రాయవలసి ఉండగా వారిలో 297 మంది విద్యార్థులు పరీక్ష కి హాజరయ్యారు 111 విద్యార్థులు పరీక్షకి గైరహాజరయ్యారు. హాజరు నమోదు శాతం 72 గా నమోదైనది.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం నుండి కాపాడిన పోలీసులు

సోమందేపల్లి మార్చి 30 ప్రభాతవార్త



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి కుటుంబ సభ్యులు పోలీసులు

మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన గణేష్ (తండ్రి: మారుతి) అనే యువకుడు కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై, రంగేపల్లి వద్ద ఉన్న రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్య చేసుకోవాలని వెళ్లిపోయిన విషయం తెలుసుకున్న పోలీసులు ఆత్మహత్యాయత్నం నుండి కాపాడారు వివరాల్లోకి వెళితే ఈ సందర్భంగా గణేష్ తల్లి శ్రీమతి లక్ష్మీదేవి గారు వెంటనే డయల్ 100 కు సమాచారం అందించగా, సోమందేపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది అత్యంత వేగంగా స్పందించి, రంగేపల్లి రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలలో శోధన చేపట్టారు. పోలీసులు సమయానికి చేరుకొని గణేష్‌ను సురక్షితంగా గుర్తించి అదుపులోకి తీసుకొని, ఎలాంటి ప్రమాదం జరగకుండా కాపాడి, వారి తల్లిదండ్రులకు సురక్షితంగా అప్పగించారు. ఈ సందర్భంగా సోమందేపల్లి పోలీస్ వారు ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ఇలాంటి అత్యవసర పరిస్థితులలో వెంటనే పోలీసులకు సమాచారం అందించవలసిందిగా, అలాగే చిన్నచిన్నసమస్యలకే మనస్తాపానికి గురికాకుండా కుటుంబ సభ్యులు పరస్పరం మాట్లాడుకొని పరిష్కారం కనుగొనవలసిందిగా వివరించారు.

## మద్యం మత్తులో ఏపీఓపై క్షేత్ర సహాయకుడు దాడికి యత్నం

పరిగి, మార్చి 30 (ప్రభాత వార్త ):

ఉపాధి హామీ పనుల్లో భాగంగా ఏపీఓ అప్పస్వామిని ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా ఫీల్డ్ అసిస్టెంట్ దాడికి ప్రయత్నించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపిన వివరాల మేరకు హో న్నంపల్లి పంచాయతీలో ఫీల్డ్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న సతీష్ కుమార్ మద్యం సేవించి కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ లో ఉన్న అధికారిపై కుర్చీలు, టేబుళ్లు తదితర వస్తువులతో దాడికి ప్రయత్నించాడు. తోటి ఉద్యోగులు ఫీల్డ్ అసిస్టెంట్ ని ఆపడానికి ప్రయత్నించగా ఎవరి మాట వినికపోవడంతో ఉపాధిహామీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడకు చేరుకుని అతన్ని స్టేషన్ కు తరలించారు. దీంతో ఏపిఓ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు.

## ఈతకు వెళ్లి బాలుడు మృతి...!

ధర్మవరం,మార్చి30,ప్రభాతవార్త



మృతి చెందిన బాలుడు వెంకి ఫోటో

ధర్మవరం మండలం గొట్లూరు గ్రామానికి చెందిన12సంవత్సరాల వెంకీ అనే బాలుడు తన తోటి స్నేహితులతో కలిసి వారి గ్రామసమీపంలో వున్నా వ్యసాయ బావిలోకి ఈతకు వెళ్లి ఈత సరిగా రాక నీళ్లలో మునిగి చనిపోయినట్టు బాలుడి మిత్రులు వెంకీ తల్లిదండ్రులకు తెలిపారు. వెంకీ ధర్మవరం లో ఒక ప్రైవేటు స్కూల్ లో 6వ తరగతి చదువుతున్నాడని. వెంకీ తండ్రి నారాయణస్వామి వ్యవసాయం చేస్తుంటాడని. వెంకీ కి ఇద్దరు అక్కలు కూడా వున్నారని గ్రామస్తులు తెలిపారు.

09ATP27_09ATP27.qxd 30-03-2026 PM 10:45 Page 1



## ప్రజలే నా బలం ప్రజల సంక్షేమమే నా పరమావధి... ఎమ్మెల్యే రాజు.

**మడకశిర టౌన్ మార్చి 30 ప్రభాతవార్త**

ప్రజలే నా బలం ప్రజల సంక్షేమమే నా పరమావధి అని ఎమ్మెల్యే రాజు అన్నారు. పట్టణంలో సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో భాగంగా నియోజకవర్గ ప్రజల నుండి అందిన అర్జీలను స్వయంగా స్వీకరించి, ఎమ్మెల్యే పరిశీలించారు. నియోజకవర్గంలో ప్రజల యొక్క ప్రతి ఒక్కరి సమస్యను సత్వరమే పరిష్కరించి ప్రజలకు న్యాయం చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఎమ్మెల్యే జారీ చేశారు. ప్రజలే నా బలం, వారి సంక్షేమమే నా పరమావధి అని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిస్సంకోచంగా నేరుగా నా దృష్టికి తీసుకురావచ్చు అని అన్నారు. ప్రజల సమస్యలు తీరుస్తూ వారి సేవలో నేను ఎల్లప్పుడు ముందుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

## వేరు వేరు రోడ్డు ప్రమాదాల్లో 9 మందికి గాయాలు

**-కణేకల్లు క్రాస్, మూలగిరిపల్లి, చీకలగుర్కి, కోనాపురం, రాయంపల్లి క్రాస్‌లో ప్రమాదాలు**

**ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త**



వాణి విద్యా నికేతన్‌వద్ద ఆర్టీసీ బస్సు ఢీకొని గాయపడ్డ ద్విచక్ర వాహన చోదకుడు యశ్వంత్, చీకలగుర్కివద్ద జరిగిన ప్రమాదంలో గాయపడ్డ వన్నూరుస్వామి

ఉరవకొండ చుట్టు ప్రక్కల సోమవారం జరిగిన వివిధ రోడ్డు ప్రమాదాల్లో 9 మంది గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే...పట్టణ శివారు కణేకల్లు రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు 10వ తరగతి విద్యార్థులను ఎక్కించుకొని వెళుతున్న ఉరవకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు కాలనీలోంచి స్కూటీ ద్విచక్రవాహనం నడుపుకొంటూ రోడ్డు మీదకు వస్తున్న యశ్వంత్ అనే యువకుడిని భువనేశ్వరి ఆలయంవద్ద ఢీకొడంతో గాయపడ్డాడు. స్థానికులు అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మండల పరిధిలోని మూలగిరిపల్లి క్రాస్‌వద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిలో రోడ్డుపై నిర్లక్ష్యంగా పడేసిన సిమెంటు దిమ్మెను ఎక్కిన ప్రయాణీకులతో వెళుతున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న వాణిశ్రీ అనే మహిళకు తీవ్ర గాయాలు కాగా గోవిందరాజులు, అతని కొడుకు సిద్ధార్థనాయక్ గాయపడ్డారు. హైవే అంబులెన్స్ 1033లో వాణిశ్రీను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. విడపనకల్లు మండలం చీకలగుర్కి గ్రామంలో రోడ్డు పక్కన ద్విచక్రవాహనాన్ని అపి నిల్చొని ఉన్న వన్నూరుస్వామిను మరొక వాహనం ఢీకొడంతో అతను తీవ్రంగా గాయపడ్డారు. అతన్ని స్థానికులు ఉరవకొండ ప్రభుత్వాసుప త్రికి తరలించగా ఇక్కడ చికిత్స పొందుతున్నాడు. మండలపరిధిలోని కోనాపురంగ్రామంవద్దఉరవకొండ డిపోకు చెందిన ఆర్టీసీహైయర్‌బస్సు వృద్ధుడైనపాదచారున్ని ఢీకొనగాఅతను తీవ్రంగా గాయపడినట్లు సమాచారం. అయితే కేసు కాకుండా అందరూ సర్దుకున్నట్లు తెలిసింది. పట్టణ శివారు రాయంపల్లి క్రాస్ రోడ్డులో ద్విచక్రవాహనంలో గొర్రెను ఉరవకొండకు తీసుకొని వస్తున్న దర్గాహొన్నూరు కు చెందిన ముగ్గురు వ్యక్తులు వాహనం అదుపుతప్పి బోల్తా పడటంతో గాయపడ్డారు. వారు స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందినట్లు సమాచారం.

## ట్రాక్టర్ ద్వారా త్రాగునీటి సౌకర్యం కల్పించిన సర్పంచ్

**అమరాపురం మార్చి 30 ప్రభాతవార్త**



ట్రాక్టర్ ద్వారా నిర్వహిస్తున్న సర్పంచ్ దృశ్యం

మండల పరిధిలోని వలస గ్రామంలో జరుగుతున్న వలస మారమ్మ దేవి పెద్ద జాతర సందర్భంగా వలస సర్పంచ్ హితేంద్ర గ్రామంలో త్రాగునీటి ఎద్దడి రాకుండా ట్రాక్టర్ ద్వారా వాడవాడల నీటి సరఫరా చేస్తున్నారు. తాను సర్పంచ్ అనే స్థాయిని పక్కనపెట్టి స్వతహాగా ట్రాక్టర్కు నీటి ట్యాంకర్ ను వేసుకొని తానే ట్రాక్టర్ ను నడుపుతూ గ్రామ ప్రజలకు త్రాగునీటి సమస్య తీర్చాడానికి కృషి చేస్తున్నారు. ట్రాక్టర్లతో ప్రతి వీధి వీధికి స్వయంగా డ్రైవింగ్ చేసుకుని తాగునీటి వసతిని కల్పిస్తున్నారు. మరి ముఖ్యంగా ఎక్కడ కూడా వీధి దీపాల ఇబ్బంది కలగకుండా ప్రజలకు విద్యుత్ సౌకర్యాలు కల్పించడానికి తానే స్వతహాగా పర్యవేక్షిస్తున్న తీరును వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

## వేసవికాలంలో చిన్నారులు, వృద్ధులు జాగ్రత్తలు తీసుకోవాలి...!

**ధర్మవరం,మార్చి30, ప్రభాతవార్త**



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీడీఎం హెచ్ బాగ్యలక్ష్మి, సీడీపీఓ జయంతి

వేసవి కాలంలో చిన్నారులు, వృద్ధులు, గర్భవతుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని డిప్యూటీడీఎం హెచి బాగ్య లక్ష్మి, సూచించారు. ఈ మేరకు సోమవారం సాయిన గర్ లోని అంగన్వాడీ కేంద్రంలో వేసవికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చిన్నపిల్లల తల్లులు, వృద్ధులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వేసవికాలంలో మధ్యాహ్న సమయంలో బయట తిరగరాదని, రోడ్డుపై తినుబండారాలను తినరాదన్నారు. నీళ్లమజ్జిగ, కొబ్బరికాయలను, ఇంటిలో తయారు చేసిన పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలన్నారు. నీరసం, కళ్లు తిరగడం లాంటి సమయంలో ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకోవాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్లో ఓఆర్ఎస్ కార్నర్ను ఏర్పాటుచేసి వాటిని డిపో మేనేజర్ సత్యనారాయణకు డిప్యూటీ డీఎంహెచ్ ఓ బాగ్యలక్ష్మీ, సీడీపీఓ జయంతి,వైద్యురాలు శ్వేత కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది అన్నా లక్ష్మీనారాయణ, విష్ణువర్ధన్,ఏఎన్ఎం, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎస్ కోనాపురంలో బడిబాట అవగాహన కార్యక్రమం

**బ్రహ్మసముద్రం మార్చి 30 ప్రభాతవార్త**



బడిబాట కార్యక్రమం దృశ్యం

మండలం పరిధిలోని ఎస్ కోనాపురం గ్రామంలో సర్పంచ్ వనిత మల్లికార్జున అధ్యక్షతన ప్రభుత్వ పాఠశాలలలో పిల్లలను చేర్పించడంపై బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఉన్నత శిఖరాలకు విద్యార్థులను తీర్చిదిద్దేలా ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ ఫలాలను అందుకోవాలని ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్య భోజనం సదుపాయాలని నోట్ పుస్తకాలు విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తుందని ప్రజలకు సూచించారు ఈ కార్యక్రమంలో కోనాపురం తెలుగుదేశం పార్టీ నాయకులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## డోనేకల్లు గ్రామ స్మశాన వాటికలో అభివృద్ధి పనులు

**-ఎమ్మెల్సీ ఆదేశాలతో ముళ్ల పొదలు తొలగించి చదును**

**ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త**



స్మశాన వాటికలో జేసీబీతో ముళ్లపొదలను తొలగించి చదును చేసిన దృశ్యం

నియోజకవర్గంలోని విడపనకల్లు మండలం డోనేకల్లు గ్రామంలో స్మశాన వాటిలో సర్పంచ్ పెట్లో సురేష్ అభివృద్ధి పనులు చేపట్టారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదేశాలతో స్మశాన వాటికలో పెరిగిన ముళ్ల పొదలను జేసీబీతో తొలగించి గుంతలను గరుసు మట్టి వేయించి చదును చేయించారు. అంత్యక్రియల సమయంలో నీటి ఇబ్బందులు తలెత్తకుండా అక్కడ సిస్టమ్ ట్యాంక్ ఏర్పాటు పనులను శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు భీమలింగప్ప, మల్లికార్జున, గ్రామపెద్దలు సత్యమయ్య, బైలు గోపాల్, బైలు ఆంజనేయ, బైలు రామాంజినేయులు, లాయర్ లేపాక్షి, వడుగూరు శేఖర్, అయ్యప్ప, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## జానెడు పొట్టకోసం..జాతిపిత వేషధారణ..!

**-ఉరవకొండలో మండుటెండలో బిక్షమెత్తిన వ్యక్తి**

**ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త**



మహాత్మా గాంధీ వేషధారణలో బిక్షం ఎత్తుకొంటున్న వ్యక్తి

జానెడు పొట్టకోసం ఒక వ్యక్తి జాతిపిత మహాత్మా గాంధీ వేషధారణలో బిక్ష మెత్తుకోవడం అందరినీ కలిచివేసింది. ఒక వ్యక్తి అచ్చం గాంధీ మహాత్ముడిగా వేషం వేసుకొని ఉరవకొండ పట్టణంలోని కవితా హోటల్ కూడలిలో మండు టెండలో కదలకుండా నిల్చొని బిక్ష మెత్తుకోవడం కనిపించింది. చుర్రుమనే ఎండలో కాళ్లకు చెప్పులు కూడా లేకుండా విగ్రహంలా నిల్చొని తన ముందు ఒక బకెట్ పెట్టుకొని బిక్షమెత్తుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 79 సంవత్సరాలు గడుస్తుండగా జానెడు పొట్ట కూటి కోసం నేటికీ అనేకమంది అవస్థలు పడుతుండటం కలిచివేస్తోంది. స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించి జాతిపితగా పిలుచుకునే మహాత్మా గాంధీ వేషధారణలో బిక్షమెత్తుకోవడం జాతికే అవమానకరమని పలువురు పేర్కొంటున్నారు. పాలకులు ఉచిత పథకాలు కాకుండా ప్రజలెవ్వరూ పస్తులుండకుండా వారికి పని కల్పించి కనీసం కూడు, గూడు, గుడ్డ అందించాల్సిన అవసరం ఉందంటున్నారు.

## 10వ తరగతి సోషియల్ పరీక్షకు 26 మంది విద్యార్థుల గైర్హాజరు

**-ఏప్రిల్ 2న జరుగనున్న ఇంగ్లీష్ పరీక్ష**



పట్టణంలోని ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన గేటువద్ద విద్యార్థుల సందడి

**ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త**

10వ తరగతి పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన సోషియల్ పరీక్షకు 26 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని మండల విద్యాధికారి హెచ్.ఈశ్వరప్ప తెలిపారు. 5 సెంటర్లలో జరిగిన పరీక్షకు 1,147 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 26 మంది గైర్హాజరుకాగా 1,121 మంది హాజరయ్యారు. స్థానిక ఎస్.కె.ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65073) 250 మంది విద్యార్థులకుగాను ఇద్దరు గైర్హాజరుకాగా 248 మంది హాజరయ్యారు. జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65074) 250 మంది విద్యార్థులకుగాను ఏడుగురు గైర్హాజరుకాగా 243 మంది హాజరయ్యారు. జెడ్పీ బాలికోన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65075) 246 మంది విద్యార్థులకుగాను నలుగురు గైర్హాజరుకాగా 242 మంది హాజరయ్యారు. వివేకానంద ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ పరీక్షా కేంద్రంలో (కోడ్: 65076) 250 మంది విద్యార్థులకుగాను ఆరుగురు గైర్హాజరుకాగా 244 మంది హాజరయ్యారు. ఏవీఆర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల పరీక్షా కేంద్రంలో (కోడ్: 65077) 151 మందికిగాను ఏడుగురు గైర్హాజరుకాగా 144 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎంఈవో వివరించారు. కాగా రంజాన్ పండుగ సెలవు కారణంగా వాయిదా పడిన ఇంగ్లీష్ పరీక్ష ఏప్రిల్ 2వ తేదీన జరుగనుంది.

## వేలం పాటలో పంచాయతీకి 5లక్షల50వేలు ఆదాయం

**అమరాపురం మార్చి 30 ప్రభాతవార్త**



వేలంపాట దృశ్యం

అమరాపురం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం అవరణంలో వారపు సంత, దినసరి సంత, బస్టాండ్ వేలంపాట నిర్వహించారు. వారపు సంతకు వేలంపాటలో రూ 3లక్షల రూపాయలకు చిత్ర శేఖర్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. విధంగా దినసరి సంతను లక్ష 20వేల రూపాయలకు చిత్ర శేఖర్ అనే వ్యక్తి వేలంపాటలో దక్కించుకున్నాడు. బస్టాండ్ ప్రాంతాన్ని వేలంపాటలో ఒక లక్ష 30 వేల రూపాయలకు మంజునాథ్ అనే వ్యక్తి వేలంపాటలో దక్కించుకున్నారు. ఈ వేలం పాటలో పంచాయతీకి అత్యధికంగా ఆదాయం వచ్చినట్టు ఈ ఓ ఆర్ డి సుధాకర్, పంచాయతీ కార్యదర్శి యోగానంద తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సహాయకులు సవిత పాల్గొన్నారు. ఈ వేలం పాటలో వేలంపాటదారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీకాంత్‌రెడ్డి ఎన్నిక

**గుత్తి, మార్చి 30 ప్రభాతవార్త**



నూతన అధ్యక్షున్ని అభినందిస్తున్న దృశ్యం

గుత్తి బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా న్యాయ వాది శ్రీకాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు. సోమవారం జరిగిన ఎన్నికల్లో ఆయన తన సమీప ప్రత్యర్థి మనోహర్‌బాబుపై 24 ఓట్ల తేడాతో గెలుపొందారు. బార్ అసోసియేషన్ పరిధిలో 97 ఓట్లు ఉండగా, వాటిలో శ్రీకాంత్‌రెడ్డికి 57 ఓట్లు, మనోహర్‌బాబుకు 33 ఓట్లు వచ్చాయి. దీంతో శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షుడుగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జాకీర్‌హుస్సేన్ ప్రకటించారు. గతంలోనే మినహా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా రామమోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా చంద్రశేఖర్, కార్యదర్శిగా నవీన్, స్పోర్ట్స్ మరియు కల్చరల్ కార్యదర్శిగా సాలన్న, కోశాధికారిగా రోజారమణి, మహిళా ప్రతినిధిగా రమాదేవితో పాటు ఏడుగురు కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా గతంలోనే ఎంపికయ్యారు.. ప్రస్తుతం అధ్యక్ష పదవికి మాత్రమే ఎన్నికలు జరిగాయి. నూతన కమిటీని పలువురు న్యాయవాదులు అభినందించారు.

## మాదిగ కళ్యాణ మండపం నిర్మాణానికి స్థలం లీజుకు ఇవ్వండి

**-పంచాయతీ పరిపాలన అధికారికి విన్నవించిన ఎంఆర్‌పీఎస్**

**ఉరవకొండ, మార్చి 30 ప్రభాతవార్త**



పంచాయతీ పరిపాలన అధికారి షేక్ మహమ్మద్ రఫీకు వినతిపత్రం అందిస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఉరవకొండ పట్టణంలో మాదిగ కళ్యాణ మండపం నిర్మాణానికిగాను గ్రామ పంచాయతీకు చెందిన 30 సెంట్లు పబ్లిక్ పర్పస్ స్థలాన్ని లీజుకు ఇవ్వాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు సోమవారం స్థానిక మేజర్ గ్రామ పంచాయతీలో పరిపాలన అధికారి షేక్ మహమ్మద్ రఫీకు వినతిపత్రం అందించారు. మండలంలో మాదిగలకు సరైన కళ్యాణ మండపం లేక వివాహాది శుభకార్యాల నిర్వహణకు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ మాదిగ కళ్యాణ మండపం నిర్మాణానికి ప్రభుత్వం ద్వారా 25 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజు, రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు కొకుంట్ల రవి, వార్డు సభ్యుడు ఎం.రామాంజినేయులు, తాలుకా అధ్యక్షులు జె.చెన్నప్ప, ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యక్రమాల అవగాహనపై పోలీసులచే ఫ్లెక్సీలు

**అమరాపురం మార్చి 30 ప్రభాతవార్త**




ఫ్లెక్సీలు ఏర్పాటు చేసిన పోలీసులు దృశ్యం

మండల పరిధిలోని వలస గ్రామములో వెలసిన మారెమ్మ దేవి పెద్ద జాతర సందర్భంగా ప్రజలనుచైతన్యపరిచాలనే ఉద్దేశంతో వలస గ్రామంలో అమరాపురం ఎస్సై వలిభాష, ఏఎస్ఐ రామాంజనేయులు ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి చైతన్య పరచడానికి కృషి చేశారు. భక్తాదులకు మరియు స్థానిక ప్రజలు చిన్నచిన్న కారణాలకు గొడవ పడడం ద్వారా జరిగే అనర్థాలు, మట్కా గ్యాంబ్లింగ్, పిల్లలపై లైంగిక దాడులు, మత్తు పదార్థాల వాడకం వంటి ఆ సాంఘిక కార్యకలాపాల పట్ల దూరంగా ఉండాలని వీటి ద్వారా చట్టం ఎలాంటి శిక్ష వేస్తుందనే దానిపై అవగాహనరావాలనే ఉద్దేశంతో పెనుకొండ సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ సూచనల మేరకు, మడకశిర రూరల్ సిఐ రాజకుమార్ ఆదేశాల మేరకు అమరాపురం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్, ఏఎస్ఐ మరియు సిబ్బంది సమిష్టి కృషితో వలస గ్రామంలో అనేక చైతన్య ఫ్లెక్సీలను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జితేంద్ర పాల్గొన్నారు. ఈ ఫ్లెక్సీలను ప్రజలు ఆసక్తికరంగా చూస్తూ ఒకరికొకరు చర్చించుకోవడం గమనార్హం

## ప్రభుత్వ బియ్యం సరఫరాలో ఘరానా మోసం

**డీలర్ల పై మరింత భారం పడుతుందని గగ్గోలు**

**బ్రహ్మసముద్రం మార్చి 30 ప్రభాతవార్త**



రేషన్ షాపులో తక్కువ తూకంతో అందిస్తున్న బియ్యం ప్యాకెట్లు

ప్రభుత్వం ప్రజలకు అందించే బియ్యంలో ఘరానా మోసాలకు పాల్పడుతున్న స్టాక్ పాయింట్ అధికారులు 50 కేజీలతో రేషన్ షాపులకు సరఫరా చేస్తున్న బియ్యం ప్యాకెట్ లో 45 కేజీలే దర్శనమిస్తున్నాయి 50 కేజీల లెక్కన రేషన్ షాపులకు అందిస్తున్న బియ్యం డీలర్లు ప్రజలకు అందించే సమయంలో తక్కువ తూకంతో స్టాక్ పాయింట్ వారు అందించడంతో రేషన్ షాప్ దుకాణదారులకు నష్టాల పాలవుతున్నారని పడమటి కోడి పల్లి రేషన్ డీలర్ స్టాక్ పాయింట్ అధికారులపై మండిపడ్డాడు ప్రతినెల రేషన్ సరఫరాలో మోసాలు జరుగుతున్నాయని అధికారులకు తెలియజేసిన అధికారులు మాత్రం చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారని డీలర్లు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారుల స్పందించి సదరు స్టాక్ పాయింట్ అధికారులపై చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి ప్రతినెలా ఇదే తంతు జరుగుతుందని డీలర్లు వాపోతున్నారు. సదరు విషయంపై స్థానిక శాసనసభ్యులు అధికారులు స్టాక్ పాయింట్లు పై చర్యలు తీసుకుంటారా వేచి చూడాలి.

## పీ4 కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం నిర్వహించిన అధికారులు...!



మాట్లాడుతున్న ఇన్చార్జ్ ఆర్డీఓ సూర్యనారాయణరెడ్డి

**ధర్మవరం,మార్చి30, ప్రభాతవార్త**



సీఎం ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షిస్తున్న అదికారులు, ప్రజాప్రతినిధులు

ధర్మవరం ఆర్డీఓ కార్యాలయ సమావేశ భవనం లో పీ4 కార్య క్రమంపై అవగాహన, సమీక్ష సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతిలో నిర్వహించిన సీఎం చంద్రబాబునాయు డు పీ4 కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా అదికారులు వీక్షించారు. సమావేశంలో పాల్గొన్న అదికారులు పీ4 కార్యక్రమం అమలు విధానంపపై లోతైన చర్చలు జరిపి, అర్హులైన కుటుంబాలను గుర్తించడం, మార్గదర్శకులను సమర్థవంతంగా అనుసంధానం చేయడం వంటి అంశాలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా కృషిచేయాలని పిలుపునిచ్చారు.పీ4 కార్యక్రమం ద్వారా లబ్దిదారుల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారి సామాజిక ఆర్థిక స్థితిని గణణీయంగా మెరుగుపరచడం లక్ష్యంగా అధికారులు కట్టుబడి ప్రత్యక్ష ప్రచారం ద్వారా సీఎం సూచించారని ఇన్చార్జ్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. పీ4 కార్యక్రమాన్ని సమర్థవంతంగా పూర్తి చేయాలని ఇన్చార్జ్ ఆర్డీఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో డీడీఓ జనార్ధన్రావు,డివిజన్ పరిధివలోని ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, నియోకవర్గ విజన్ టీం సభ్యులు, ప్రజాప్రతినిదులు పాల్గొన్నారు.

## తేదేపా ఉత్తమ ఐటిడిపి తాలూకా అధ్యక్షుడుగా కాంతరాజు

**మడకశిర మార్చి 30 ప్రభాతవార్త:**



కాంత రాజును సన్మానిస్తున్న ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ

మడకశిర నియోజక వర్గం తెలుగు దేశం పార్టీ మడకశిర తాలూకా ఐ టిడిపి అధ్యక్షుడిగా కాంత రాజు ను ఎంపిక చేసి ఆదివారం జరిగిన తెలుగు దేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కాంత రాజును ఘనంగా సన్మానించారు. పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఉత్తమ ఐ టిడిపి తాలూకా అధ్యక్షుడిగా కాంత రాజు ను గుర్తించి ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ఘనంగా సన్మానించారు. కాంత రాజు మాట్లాడుతూ తన సేవకు గుర్తింపు నిచ్చిన ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కు, నారాలోకేష్, ఎమ్మెల్యే ఎం ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పే స్వామిలకు ప్రత్యేక ధన్య వాదాలను తెలియజేశారు. తాను ఎల్లప్పుడూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేశాడు.

## నాటుసారా రహిత జిల్లాగా రూపొందించాలి

**-ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య**



ఎక్సైజ్ డిసి నాగ మద్దయ్య మాట్లాడుతున్న దృశ్యం

**గుత్తి, మార్చి 30 ప్రభాతవార్త**

జిల్లా వ్యాప్తంగా నాటుసారాను అరికట్టేందుకు నిరంతరం దాడులు నిర్వహించి నాటుసారా రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య పేర్కొన్నారు. స్థానిక ఎక్సైజ్ సిఐ కార్యాలయాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నవోదయం 2.0, స్థితిగతులను సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అరెస్టులను కంప్లీట్ చేయాలని, బైండోవర్లు పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం స్థానికంగా ఉన్న బార్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ ఉమాదేవి, ఎస్ఐలు గోపాల్, అలీబేగ్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్న రోగులు

**అగళి, మార్చి 30 ప్రభాతవార్త**



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎల్వి ప్రసాద్ నేత్ర వైద్య, విజ్ఞాన కేంద్రం హైదరాబాద్ వారు సామాజిక బాధ్యతతో పేద రోగులకు తమవంతు సహకారం అందించాలన్న ఉద్దేశ్యంతో ఇరిగేపల్లి ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు సర్పంచు లక్ష్మమ్మ లింగరాజు, మంజునాథ్ తెలిపారు. ఈ వైద్య శిబిరంలో అనేక మంది రోగులు చికిత్స చేయించుకున్నట్లు వారు తెలిపారు.

## వృత్తి విద్యా కోర్సులు విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి

**- ఆదర్శపాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారి**

**అగళి, మార్చి 30 ప్రభాతవార్త**



వృత్తి విద్య కోర్సుల గురించి విద్యార్థులకు వివరిస్తున్న దృశ్యం

అగళి మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఒకేషనల్ విద్యార్థులు బ్యూటి అండ్ వెల్నెస్, ఐటి ట్రేడ్‌లో భాగంగా 10 రోజులపాటు ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాంలో భాగంగా అగళి విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్యూటీ పార్లర్లు, నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు బ్యూటీ పార్లర్ సంబంధించిన ప్రత్యక్ష అవగాహన నైపుణ్యం పొందిన వారిచే శిక్షణ అందించారు. అలాగే ఐటి ట్రేడ్ గురించి పలు షాపులను సందర్శించడం జరిగింది. ఇంటర్నెట్ సెంటర్, ప్రింటింగ్ ప్రెస్, మొబైల్‌హార్డ్వేర్ తదితర వాటిపై సందర్శించిన విద్యార్థులకు అవగాహన కల్పించారు. అదే విధంగా నైపుణ్యం పొందుతున్న విద్యార్థులను శ్రీ సత్యసాయి జిల్లా డిస్ట్రిక్ట్ ఒకేషనల్ కోఆర్డినేటర్ నరసింహ మూర్తి, నరేంద్ర సందర్శించారు. విద్యార్థులతో చర్చించి, వారు నేర్చుకున్న సెంటర్లలో చేసే పనులపై సమగ్ర అవగాహన పొందారు. ఈ కార్యక్రమంలో ఒకేషనల్ ట్రైనర్ ఆర్.నాగరత్నమ్మ, చంద్రబాబునాయుడు పర్యవేక్షణలో జరిగింది. విద్యార్థులు తమ ప్రాక్టికల్ అనుభవాలను పంచుకున్నారు. ఈ అవకాశాన్ని కల్పించిన ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ విజయకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా మారెమ్మ దేవత జలది ఉత్సవం, రథోత్సవం

**అగళి, మార్చి 30 ప్రభాతవార్త**



మారెమ్మ దేవతను అలంకరించిన దృశ్యం

మండల పరిధిలోని ఉల్లెకెర గ్రామంలో వెలసిన పురాతన మారెమ్మ దేవత ఉత్సవ వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ప్రతియేటా శ్రీరామనవమి అనంతరం మారెమ్మ జాతరను నిర్వహిస్తారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పూజలు నిర్వహించి జలది కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మారెమ్మ దేవత మూల విరాట్‌ను వివిధ రకాల పూలతో, విద్యుత్ దీపాలతో అలంకరించి పుర వీధుల గుండా భక్తులు ఉత్సాహంగా రథాన్ని లాగారు. మారెమ్మ దేవత రథోత్సవానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ప్రత్యేకంగా ఆమారెమ్మ దేవతకు మహిళలు హారతులు పట్టారు. మహామంగళహారతి అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని ఆలయ మండలి వారు వితరణ చేశారు.

